గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మహిళా రైతు జేఏసీ సభ్యులు

అనుమతులు ఉపసంహరించుకోవాలి

గుమ్మడిదల,మార్చి 25: ప్రభుత్వం ప్యారానగర్ డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు తక్షణమే ఉపసంహరించుకోవాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో మహిళా రైతు జేఏసీ నాయకులు 49వ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, మంబాపూర్ గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)ను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రవీందర్‌రెడ్డి, సునీతా, మల్లమ్మ, మన్నె రామకృష్ణ, సూర్యనారాయణ, రైతు సంఘం అధ్యక్షుడు సదానంద రెడ్డి, బాల్‌రెడ్డి, రమణారెడ్డి, అమ్మగారి రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, సంజీవరెడ్డి, కుమ్మరి ఆంజనేయులు, కొరివి సురేశ్, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ వీఎస్‌రాం

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

జహీరాబాద్, మార్చి 25: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జహీరాబాద్ మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ వీఎస్‌రాం అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు న్యాల్‌కల్‌లోని కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలను మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ నిధుల కింద దాదాపు రూ.35లక్షలతో పాఠశాలలో అభివృద్ధి పనులతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధితోపాటు మౌలిక సదుపాయాలు కల్పించినందుకు కలెక్టర్‌కు, మహీంద్రా ప్లాంట్ యాజమాన్యానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్య స్వామి, మండల విద్యాధికారి మారుతీరాథోడ్, మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

కొండాపూర్, మార్చి 25: కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ మంగళవారం యూబీ గోల్కొండ పరిశ్రమ వద్ద సీఐటీయూ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, స్థానికులకు పరిశ్రమ లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డి మాండ్ చేశారు. పరిశ్రమలో ఏండ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పలు సందర్భాల్లో వేతనాలు పెంచాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తే కార్మికులను పెద్ద సంఖ్యలో సమీకరించి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాందాస్, కొండల్‌రెడ్డి, పాండురంగం, విష్ణు, శ్రీకాంత్, జయరాజ్, గోపాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశ వర్కర్లు

ప్రభుత్వం ఆశలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

జహీరాబాద్, మార్చి 25: ఎన్నికల్లో ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం అసెంబ్లీని ముట్టడించేందుకు వెళ్లిన ఆశ వర్కర్లను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. న్యాల్‌కల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోనూ ఆశ వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పెరుగుతున్న ధరలకు అనుకులంగా ఆశ వర్కర్లకు వేతనం కనీసం రూ.18 వేలకు పెంచి, అర్హులైన వారికి ఏఎన్ఎంలుగా ప్రమోషన్లు కల్పించి, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంగన్న, ఆశ వర్కర్ల సంఘం నాయకురాలు నందమ్మ, శ్యామల, శోభ, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడిగా దుర్గా ప్రసాద్

జహీరాబాద్, మార్చి 25: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జహీరాబాద్ పట్టణ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా తిరుపతి, మహేశ్వర్, కార్యదర్శిగా శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా మల్లేశం, మహేశ్, సభ్యులుగా కృష్ణ, శివకుమార్, యాదగిరి, తుకారం తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామి ఆలయంలో గజవాహన సేవలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

వీరభద్రస్వామి గర్భ గుడి ద్వారాలకు విరాళం

గుమ్మడిదల, మార్చి 25: సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలోని గర్భగుడి ద్వారాలకు బీఆర్ఎస్ నాయకులు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. గజవాహన సేవలో పాల్గొని పూజలు చేశారు. బుధవారం తెల్లవారుజామున భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి విమాన రథోత్సవాన్ని నిర్వహించనున్న ట్లు చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య తెలిపారు.

రంజాన్ కిట్లు పంపిణీ

సదాశివపేట, మార్చి 25: మండల పరిధిలోని వెల్టూర్‌లో రంజాన్ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి మంగళవారం ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ ముస్లీంలకు ఎంతో పవిత్రమైందని, ముస్లింలకు తన వంతు సహాయంగా కిట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షబ్బీర్, నైజాం, చోటు, బీఆర్ఎస్ నాయకులు సత్యం, రవి, సుందర్, పాండు, దశరథ్ ఉన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికలు

అందోల్, మార్చి 25: జోగిపేట మున్సిప్ కోర్టులో మంగళవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా, సీనియర్ న్యాయవాది వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సార వెంకటేశంలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులను న్యాయవాదులు అభినందించి సన్మానించారు.

ఎన్పీఆర్డీ కన్వీనర్‌గా సాయమ్మ

అందోల్, మార్చి 25:వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్పీఆర్డీ) మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా అందోల్ మండలం కన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన సాయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయమ్మ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మహిళా విభాగం కన్వీనర్‌గా ఎన్నుకున్న జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనవంతుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పొగాకు ఆరోగ్యానికి హానికరం

అందోల్, మార్చి 25: పొగాకు ఆరోగ్యానికి హానికరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం జోగిపేట లోని పలు దుకాణాలు, ప్రధాన చౌరాస్తాల్లో పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, చుట్ట, సిగరేట్, జర్దా, తంబాకు, పాన్‌మాసాల వాడటం వలన హైపర్‌టెన్షన్, నోటిక్యాన్సర్, శ్వాసకోస వ్యాధులు వస్తాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు.

వృత్తి నైపుణ్యాభివృద్ధి అభినందనీయం

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 25: తారా ప్రభుత్వ కళాశాలలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించే విధంగా బోధన ఉన్నదని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ డీన్, ప్రొఫెసర్ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మంగళవారం తారా ప్రభుత్వ కళాశాలలో 7వ అకడమిక్ కౌన్సిల్ సమావేశం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. అటానమస్ హోదా పొందిన తారా కళాశాలలో ప్రతి ఏడాది విద్యా విషయక సంబంధిత విషయాలపై విశ్వవిద్యాలయ నామినేటెడ్ వ్యక్తులతోపాటు వివిధ రంగాలకు చెందిన వ్యక్తులతో అకడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో ఉన్న పారిశ్రామిక సంస్థల్లో విద్యార్థులకు ఉపాధి పొందే విధంగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. విద్యార్థులలో నాణ్యమైన విద్యతో పాటు నైతిక, మానవీయ, సామాజిక విలువలను పెంపొందించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కరుణాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యతోపాటు మూర్తిమత్వ అభివృద్ధి ఉంటుందన్నారు. విద్యతోపాటు సహ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఏర్పడుతుందన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ తారా కళాశాలలో 42 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండగా, అందులో 35 మంది అధ్యాపకులు డాక్టరేట్ కలిగి ఉండడం అసాధారణమన్నారు. జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి మాట్లాడుతూ తారా కళాశాలలో అమ్మాయిల కోసం ప్రత్యేక హాస్టల్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులందరికీ ఉపకార వేతనాలను అందేలా చూస్తామన్నారు. అంతకు ముందు కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో సాధించిన విజయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పీపీటీ ద్వారా వివరించారు. సమావేశంలో పారిశ్రామిక వేత్త డాక్టర్ సబితా, ఐఐటీ హైదరాబాద్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్, అకడమిక్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ సరోజినీచక్రవర్తి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లిక కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు, అన్ని విభాగాధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు

చిన్నారులకు పండ్లు తినిపిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఇఫ్తార్ విందుకు హాజరైన కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 25: కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు. టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో ముస్లిం ఉద్యోగులకు నిర్వహించిన ఇఫ్తార్‌విందులో కలెక్టర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నారులకు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లింలందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇఫ్తార్ విందుతో ఉద్యోగుల్లో స్నేహభావం పెంపొందుతుందన్నారు. టీజీటీఏ అధ్యక్షురాలు షేక్ హసీనా, ప్రధానకార్యదర్శి నజీమ్‌ఖాన్, టీజీఆర్ఎస్ఏ అసోసియేట్ అధ్యక్షుడు హేమంత్, కలెక్టరేట్ ఏవో పరమేశ్, అందోల్ తహసీల్దార్ విష్ణుసాగర్, ఉద్యోగులు ఉన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

అమీన్‌పూర్ మార్చి 25: మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 30 సుల్తాన్‌పూర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. డిప్యూటీ తాసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సుల్తాన్‌పూర్‌లోని సర్వే నెంబర్ 30లో అక్రమంగా కట్టడాలు చేపట్టడంతో కూల్చివేశామని,మళ్లీ పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవన్నారు.

అక్రమ కట్టడాలను కూల్చేస్తున్న అధికారులు

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

మునిపల్లి, మార్చి 25: పంచాయతీ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. మంగళవారం మండలంలోని బుదేరా, పెద్ద గోపులారం, పోల్కంపల్లి గ్రామాలను ఆయన సందర్శించి పారిశుధ్య పనులు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు బుదేరాలో స్వయంగా ఆయనే ఎల్ఆర్ఎస్ పేమెంట్స్ చేయించారు. గ్రామాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉండి, పారిశుధ్య నిర్వహణ చూసుకోవాలన్నారు. వందశాతం ఎల్ఆర్ఎస్ పేమెంట్స్ అయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో హరినందన్ రావు, ఎంపీవో అండాలమ్మ. కార్యదర్శులు ఉన్నారు.

రాయికోడ్‌లో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి జగదీశ్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాయికోడ్, మార్చి 25: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వేసవి దృష్ట్యా నీటి సమస్యలు లేకుండా చూసే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని మండల ప్రత్యేక అధికారి జగదీశ్ అన్నారు. మంగళవారం రాయికోడ్ ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మండల, గ్రామస్థాయి అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత ఉందాన్నారు. ముఖ్యంగా ఉపాధిహామీ పథకం, తాగునీటి సమస్య ఉంటే వెంటనే ఎంపీడీవో కార్యాలయంలో సమాచారం అందించాలన్నారు. పంచాయతీ కార్యాదర్శులు తాగునీటి సరఫరాపై నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీడీవో షరీఫ్, అధికారులు నర్సింహారెడ్డి, రమేశ్, విష్ణు, తుక్కప్ప, వరప్రసాద్, మురళి, పవన్‌కుమార్, శివశంకర్ ఉన్నారు.

పీఎంశ్రీ పథకంలో మరో మూడు పాఠశాలలు ఎంపిక

జిన్నారం, మార్చి 25: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి శ్రీకారం చుట్టిందని జిన్నారం మండల ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి అన్నారు. మంగళవారం ఆయన జిన్నారంలో మాట్లాడుతూ...పీఎంశ్రీ పథకంలో మరో మూడు పాఠశాలలు ఎంపికైనట్లు తెలిపారు. వీటిలో జిన్నారం, చెట్ల పోతారం, మాదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. పథకంలో భాగంగా ఎంపికైన పాఠశాలలకు విడతల వారీగా మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చించనున్నట్లు చెప్పారు. ఆధునిక పద్ధతులతో విద్యాబోధన, డిజిటల్ విద్య అమలుతోపాటు సాంకేతిక పరికరాలను అందించనున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి తెలిపారు. ఇప్పటికే ఈ పథకంలో జిన్నారంలో గిరిజన గురుకుల పాఠశాల, బొల్లారంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి.

ఎంపీడీవో అరుణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఎంపీడీవోను కలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు

జిన్నారం, మార్చి 25:మండల కేంద్రంలోని పూర్వ పాఠశాల సముదాయంలోనే అదనపు తరగతి గదులు నిర్మించాలని తల్లిదండ్రులు ఎంపీడీవోను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో అరుణారెడ్డిని విద్యార్థుల తల్లిదండ్రులు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..1002 సర్వే నెంబర్‌లో హెటీరో పరిశ్రమ సహకారంతో నిర్మించనున్న అదనపు తరగతి గదులను గ్రామంలోని పూర్వ పాఠశాలలోని విశాలమైన సముదాయంలో నిర్మించాలన్నారు. దూరభారం తగ్గడమే కాకుండా విద్యార్థులు తల్లిదండ్రుల కండ్ల ఎదుటే చదువులు కొనసాగించే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రుల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని పూర్వ పాఠశాలలోనే అదనపు గదులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి, మహేందర్ గౌడ్, ప్రవీణ్, రమేశ్, రాములు, యాదగిరి, భిక్షపతి, వెంకటేశ్, మహేశ్, అశోక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించాలి

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 25: పండుగలు చేస్తే నియోజకవర్గంలో అభివృద్ధి జరగదని, ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించాలని సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 42 మందికి రూ.14 లక్షల 42 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సీఎంఆర్ఎఫ్ చెక్కుల మంజూరుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. బీఆర్ఎస్ హయాంలో సంగారెడ్డి అభివృద్ధికి రూ.75కోట్ల నిధులు మంజూరు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం రూ.40 కోట్ల నిధులను రద్దు చేసి పట్టణ అభివృద్ధిని అడ్డుకున్నదని దుయ్యబట్టారు. నిధులు వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే లేఖ రాసినా స్పందన లేదన్నారు. పండుగలు చేసినంత మాత్రానా అభివృద్ధి జరగదని, నాయకుడు కాజాలడని, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. త్వరలో ఎమ్మెల్యే నాయకత్వంలో పెద్దఎత్తున నియోజకవర్గ సమస్యలపై ఉద్యమ బాట పడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింహులు, మండలాధ్యక్షుడు చక్రపాణి, నాయకులు విఠల్, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

మహిళపై లైంగిక దాడి

కంది, మార్చి 25: ఆటోలో వెళ్తున్న మహిళపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఆటో డ్రైవరైన భర్తతో మహిళ (35) ఆటోలో సదాశివపేట్ నుంచి ఎంఎన్ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో భర్త టాయిలెట్ కోసం ఆటోను రోడ్డు పక్కన ఆపాడు. అటుగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు భర్తపై దాడి చేసి మహిళను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన భర్తపై దాడి చేసి మరీ ఈ ఘతకానికి పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణ తర్వాత పూర్తి వివరాలు తెలియజేయనున్నట్లు రూరల్ పోసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ పరితోశ్ పంకజ్, డీఎస్పీ పరిశీలించారు.

విభిన్న ప్రతిభావంతుల చదువు, ఆరోగ్యాన్ని తెలుసుకుంటున్న జడ్జి రమేశ్

సబితా ప్రతిభావంతుల పాఠశాలను సందర్శించిన జడ్జి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 25: సుప్రీం కోర్టు ఉత్తర్వులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్ పట్టణంలోని సబితా ప్రతిభావంతుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల చదువులు, ఆరోగ్య వివరాలను నిర్వాహకులకు అడిగి తెలుసుకున్నారు. వారికి కావాల్సిన న్యాయ సహాయం అందజేస్తామని జడ్జి వెల్లడించారు. కార్యక్రమంలో సబితా పాఠశాల ప్రిన్సిపాల్ సరిత, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పన్ను చెల్లించాలి

జహీరాబాద్, మార్చి 25: మున్సిపాలిటీలో పన్నులు సకాలంలో చెల్లించాలని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఉమమహేశ్వర్ రావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని నివాస గృహ యజమానులు, దుకాణాదారులు దాదాపు రూ.15 కోట్ల వరకు పన్నులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీ పరిధిలో రూ.5.80 కోట్ల వరకు వసూలు చేశామన్నారు. పన్నులు చెల్లించాలని ఆరు దుకాణాలు, విద్య సంస్థలను సీజ్ చేయగా, నాలుగింటికి పన్నులు చెల్లించారన్నారు. వాటి విలువ రూ.6 లక్షల వరకు ఉందన్నారు. వ్యాపార దుకాణాలకు సంబంధించి 75శాతం పన్నులు వసూలు చేశామని, వాటి విలువ రూ.58 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీలోగా నివాస గృహ యజమానులు, వ్యాపార దుకాణాదారులు పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు. అధిక మొత్తంలో బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరా బంద్

సదాశివపేట, మార్చి 25: తాగునీటి పైప్ లైన్ లీకేజీ కారణంగా 28వ తేదీ వరకు మూడు రోజులపాటు తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ఉమా మంగళవారం ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి చౌరస్తా వద్ద తాగునీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీ అయిందని, పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసే వరకు తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలు సహకరించగలరని ఆమె కోరారు.

నష్టపరిహారం చెల్లించాలి

సదాశివపేట, మార్చి 25: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సదాశివపేట సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెండ్రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు జిల్లాలోని జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, జోగిపేట, సదాశివపేట, కొండాపూర్ మండలాల్లో మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోవడంతోపాటు మామిడికాయలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు బుజ్జమ్మ, లింగం పాల్గొన్నారు.